# "కా ర ణం"

"శ్రీగిరి"

"ఏమోయ్ డాక్టరున్నారా"

"ఉన్నారండీ"

"ఇపుడు చూడటానికి వీలుంటుందేమో కనుక్కో"

"తెల్లవార్లేగదండి ఆయన పరీక్ష చేసేది"

"కనుక్కొండూ తెల్లవార్లని నాకూ తెలుసులే"

"... ... ... ..."

"... ... ... ..."

"రమ్మన్నారండీ పైకి"

౨

"అబ్బాయిగారా, ఏం ఇప్పుడు?"

"... ... ... ..."

"చెప్పండి. నాదగ్గర దాపరికమైతే ఎట్లా"

"ఏం లేదండి, ఒక సందేహం: ఈమధ్య ఏదో పుస్తకాలు తిరగేస్తున్నా"

"... ... ... ..."

"నాజబ్బులకు భయాలకు బుద్ధి మాంద్యానికి కారణం..."

"... ... ... ..."

"మావాళ్లకేమైనా జబ్బుండా"

"... ... ... ..."

"చెప్పండి. వుందంటార్రా"

"... ... ... ..."

"చెప్పండి"

"ఆ—అదే కారణం నీ శరీరస్థితికి"

"అయితే నాసందేహం రూఢే"

"ఆ"

"పిల్లలు కడుపులోనే చావడం కూడా"

"ఆ-అన్నీను. పుట్టినవాళ్లు చిక్కి-చిక్కి చావడం—అన్నీని"

"... ... ... ..."

"అసలు ఆయన పెండ్లాడే వుండకూడదు—మీ నాయన"

"..........."

"మీ అమ్మకూ—పుట్టిన మీకూ, ఆజబ్బు లక్షణాలు పోతే"

"పెండ్లి చేసుకొన్నా పిల్లా పీచు లేని ఉపాయమేదైనా అనుకొంటే బ్రతికి పోయుండే వాళ్లం"

"..........."

"వాళ్లు అవస్థపడటమే కాకుండా మాకు కూడా... ..."

"..........."

"మమ్మల్నిలా కని పారేయడంలో వాళ్ల ఉద్దేశం...?"

"..........."

"అయ్యయ్యో!"

3

"అదేంరా—గదిలో మేముంటుంటే అలావచ్చావు!-అదీ అర్ధరాత్రీనూ"

"..........."

"వెధవా-పో—అవతలకి, మొద్దల్లే నిల్చోక"

"... ... ... ... ... ..."

"అయినా ఎందుకు వచ్చింది?"

"మీకులాసా చూడలేక"

"చూడలేక—ఏం, వెర్రిపుట్టిదా"

"అదీ పుట్టుతుంది మీ ధర్మమా అంటూను"

"ఏమిటెది అసందర్భంగా"

"అంతా సందర్భంగాయేడ్చినట్లు!"

"..........."

"..........."

"ఆచేతుల్లో ఏమిటి"

"..........."

"చంపుతావా ఎమిటి కొంపతీసి!"

"ఆ"

"కారణం"

"వళ్లు తెలియని ఆ వేశంతో ఇలా కంటూ"

"ఆ! ఆ!..."

"గ్రుడ్డివాళ్లని చచ్చువాళ్ళని మతి భ్రష్టులని"

"... ... ... ... ..."

"... ... ... ... ..."

"అయ్యో చంపేశాడు రా...".

"చావు చావు—నాదీ అదే ప్రయత్నం"

౪

"నీవు దోషివి. నీ తుది కోరికేమైనా వుందా"

"ఏం లేదు—ఒకటి"

"ఏం"

"నేను చస్తామనుకొన్నా, వెంటనే చావనియ్యాలా. పోనీ అదీ మంచికే. నా ఆస్తి చాలావుందిగా. దాన్ని..."

"..........."

"నాలాగే జనించి అనాధలుగా వుండేవాళ్లకు పంచండి"